క్లుప్తంగా

23 నుంచి యువతకు శిక్షణ

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీలో యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అంశంపై ఈ నెల 23, 24, 25వ తేదీలలో శిక్షణ ఇవ్వనున్నట్లు జాతీయ సేవా పథకం వైవీయూ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ శిక్షణకు కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఎంపిక చేసిన పీవోలు హాజరవుతున్నారని వివరించారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు


విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు మంగళవారం దోష నివారణ పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని, అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక పూజలు నిర్వహించారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు కడప మండలంలోని పాఠశాలలకు సెలవు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలో బుధవారం నిర్వహించబోయే శ్రీరామ మహాశోభ యాత్రను పురస్కరించుకుని కడప మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు ఎంఈఓ దిద్దకుంట గంగిరెడ్డి తెలిపారు. శోభాయాత్ర సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల కోరిక మేరకు మరియు విద్యార్థుల భద్రత దృష్ట్యా అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

పరిహారం అందేలా చూడాలి


వన్‌స్టాప్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఎస్‌కే. రోక్యా బేగం

కడప కోటిరెడ్డి సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారాన్ని త్వరగా అందేలా చూడాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ ఎస్‌కే.రోక్యాబేగం తెలిపారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పీడీ కార్యాలయం, వన్‌స్టాప్ సెంటర్(సఖీ)ను మంగళవారం ఆమె సందర్శించారు. అనంతరం ఆమె అక్కడి బాధితులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, వాణి, ఫర్వీన్, సుభాష్‌యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం.. ఎంతో ప్రధానం


డాక్టర్ హరిత

కడప రూరల్ : శారీరక ఆరోగ్యమే కాదు.. మానసిక ఆరోగ్యం ఎంతో ప్రధానమని అమృత మైండ్ కేర్ వైద్యులు హరిత తెలిపారు. తమ ఆసుపత్రి స్థాపించి ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె స్థానిక ఆసుపత్రిలో విలేకరులతో మంగళవారం మాట్లాడుతూ మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేన్నైనా సాధించగలరన్నారు. ముఖ్యంగా మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రతి ఎనిమిది మందిలో ఒకరికి మానసిక సమస్య ఉన్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఆధునిక సమాజంలో ఒత్తిడి, ఇతర సమస్యలను ఎదుర్కోవడానికి మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు తక్షణం వైద్యులను సంప్రదించాలని సూచించారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వీరపునాయునిపల్లె : వరి, వేరుశనగ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని తంగెడుపల్లె, ఎన్.పాలగిరి గ్రామాల్లో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సాగులో ఉన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. వరి పంట సాగు చేసే పొలాల్లో జింక్ లోపం అధికంగా ఉందని దుక్కిలో జింక్ సల్ఫేట్ వేసుకొని రైతులు తక్షణమే చిలెటెడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వరి పంటలో ప్రతి రైతు తప్పని సరిగా కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ఆకు ముడత, కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిపాస్, 500 మిల్లీ లీటర్లు లేదా క్లోరంతో నిలిప్రోల్ 60 మిల్లీ లీటరు 2 వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ వేరుశనగ పంట పూత దశలో ఉందని ఒక్కో ఎకరాకు 2 వందల కిలోల జిప్సమ్‌ను వేయాలని అలా చేయడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. సేంద్రీయ ఎరువులను వాడటం వలన సూక్ష్మదాతు లోపాలను నివారించవచ్చన్నారు. ప్రసాద్ నాయక్, గంగయ్య, రైతులు పాల్గొన్నారు.

రామయ్య యాత్రకు సర్వం సిద్ధం

ఒక మహత్ కార్యానికి తెర లేచింది. కడప నగరం కాషాయం రంగు నింపుకొంది. అడుగడుగునా జెండాలతో శ్రీరామ చంద్రుని కటౌట్లు, ఫ్లెక్సీలతో జనంలో ఆధ్యాత్మిక భావన రేకెత్తుతోంది. ప్రధాన వీధుల్లో శ్రీరామ శోభయాత్ర బ్యానర్లు కనిపిస్తున్నాయి. కడప నగరంలో ఇలాంటి భారీ ఆధ్యాత్మిక యాత్ర జరగడం బహుశా ఇదే ప్రథమం కావచ్చు. ఎక్కడా ఎలాంటి తొక్కిసలాట లేకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా యాత్రను ఆద్యంతం అత్యంత క్రమశిక్షణాయుతంగా నిర్వహించేందుకు అయోధ్య ఐక్యవేదిక ప్రతినిధులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

- మున్సిపల్ మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 6 గంటలకు కల్యాణం
- 9 గంటల నుంచి మహా శోభాయాత్ర
- కనులవిందుగా కల్యాణ వేదిక ఏర్పాటు
- వేదిక వద్దనే అన్న ప్రసాద వితరణ
- నగరమంతటా భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు
- యాత్రకు స్వాగతం పలికే కషాయ జెండా తోరణాలు



కడప కల్చరల్: కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండ రామాలయం ఈ మహత్ కార్యానికి కేంద్రంగా నిలిచింది. దాదాపు రెండు మాసాలుగా ప్రతి పది రోజులకోసారి ఈ యాత్ర నిర్వహణపై సుదీర్ఘ చర్చలు సాగిన అనంతరం తుది కార్యక్రమాన్ని రూపొందించారు. ఖర్చుతో కూడిన కార్యక్రమమే అయినా భక్తులంతా తలో చేయి వేసేందుకు సిద్ధం కావడంతో రేయింబవళ్లు ఉత్సాహంగా కార్యక్రమానికి రూపుదిద్ది తుది అంకానికి చేర్చారు.

భారీ ఏర్పాట్లు

అయోధ్యలో బాల శ్రీరాముడిని ప్రతిష్ఠించి ఏడాది గడచిన సందర్భంగా తొలి వార్షికోత్సవంగా కడప నగరంలో బుధవారం శ్రీరామ మహా శోభ యాత్ర నిర్వహించాలని అయోధ్య ఐక్య వేదిక నిర్ణయించింది. హిందువుల్లోని అన్ని వర్గాలను కలుపుకొని యాత్రకు ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం మున్సిపల్ మైదానంలో కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనుంది. ఇందుకోసం మైదానమంతా పూర్తిగా భారీగా రంగురంగుల పందిళ్లు ఏర్పాటుచేసి కల్యాణ శోభ ఉట్టిపడేలా అరటి పిలకలతో అలంకరించారు. పురుషులు, మహిళా భక్తులకు ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాటుచేశారు. వేదిక ఎడమవైపున ప్రముఖులకు సీటింగ్ ఏర్పాటుచేయడంతోపాటు వేదికకు ఎదురుగా సన్నాయి మేళాల బృందాల కోసం ఏర్పాట్లు చేశారు. భక్తులందరికీ కల్యాణ క్రతువు స్పష్టంగా కనబడేలా ప్రతి సీటింగ్ చాంబర్‌లోనూ భారీగా ఎల్‌ఈడీ స్క్రీన్‌లను అమర్చారు. కల్యాణ వేదిక కనుల పండువగా తీర్చిదిద్దారు. మధ్యలో వెంకటేశ్వరుడి నిలువెత్తు ప్రతిమను నిలిపారు. వేదికకు వెళ్లే ప్రధాన ద్వారం వద్ద భారీ శివలింగాన్ని ఏర్పాటు చేశారు. భారీ పందిట్లో అన్నప్రసాద వితరణ కోసం ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి సాకర్యం, మరుగుదొడ్లను సిద్ధం చేశారు.

అడుగడుగునా అల్పాహారం

మహాశోభయాత్రలో భాగంగా కార్యక్రమ నిర్వాహకుల్లో పలువురు ప్రముఖ కూడళ్లలో యాత్ర ముగిసే వరకు అన్నదానం, అల్పాహారం, మంచినీరు, కాఫీ, టీలు, కూల్ డ్రింక్‌లను సిద్ధం చేస్తున్నారు. కో ఆపరేటివ్ కాలనీలో స్థానిక ప్రముఖులు అన్నదానం అత్యంత భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ యాత్రలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన సాంస్కృతిక, కళా బృందాల ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. భక్తుల కోలాటాలు, చెక్కభజన, విద్యార్థుల నృత్యాలు యాత్రకు శోభనివ్వనున్నాయి.

దేవుడి పెళ్లికి అందరూ పెద్దలే

ఈ శోభయాత్ర అన్ని వర్గాల వారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తమ సొంత కార్యక్రమంగా భావించి ఏర్పాట్లలో తలో చేయి వేశారు. కార్యక్రమాన్ని అంత్యంత భారీగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించారు. ఇందులో భాగంగా నగరమంతటా శోభయాత్రను స్వాగతిస్తూ తమ ఫొటోలతో భారీ ఫ్లెక్సీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. పలు ప్రముఖ కూడళ్లు ఈ హోర్డింగ్‌లతో నిండిపోయాయి. ప్రముఖ ప్రజాప్రతినిధులు, చిన్న స్థాయి నాయకులు, వ్యాపారవేత్తలు, వ్యాపార సంస్థలు, చివరికి విద్యా సంస్థలే కాకుండా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు కూడా హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడం విశేషం.

యాత్ర మార్గం


వేదిక వద్ద ఎల్ఈడీ టీవీ

మున్సిపల్‌మైదానం నుంచి ప్రత్యేకంగా రూపొందించిన రథంపై భారీ సైజులో శ్రీరామచంద్రుడి విగ్రహాన్ని యాత్రకు ప్రధాన ఆకర్షణగా ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ శోభ యాత్ర నగరంలోని 21కి పైగా కూడళ్ల మీదుగా సాగనుంది. శంకరాపురం, అప్సర సర్కిల్, ఎన్జీవో కాలనీరోడ్డు, వైజంక్షన్, ఆర్టీసీ సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డివీధి, కో ఆపరేటివ్ కాలనీ, అన్నమయ్య సర్కిల్, కృష్ణా సర్కిల్, గోకుల్ సర్కిల్, వన్ టౌన్ సర్కిల్, హెడ్ పోస్టాఫీసు, పాత బస్టాండ్, ఏడురోడ్లు, ఇందిరమ్మ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కోటి రెడ్డిసర్కిల్, కాగితాలపెంట, ఐటీఐ సర్కిల్, సంధ్యసర్కిల్, ఎర్రముక్కపల్లి, రాజీవ్ పార్క్ మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీకోదండరామాలయంకు చేరుకోవడంతో ముగియనుంది.

శోభాయాత్రకు పకడ్బందీ బందోబస్తు



కడప నగరంలో బుధవారం(ఈ నెల 22న) ఉదయం 6 గంటల నుంచి జరిగే శోభా యాత్రకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశాం. కడప సబ్ డివిజనల్ పరిధిలోని 9 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 300 మంది పోలీస్ సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలను ఏర్పాటుచేశాం. యాత్ర ముగిసేవరకూ డ్రోన్ కెమెరా ద్వారా శోభాయాత్రను చిత్రీకరిస్తాం. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని నిర్వాహకులకు తెలిపాం. ఎవరైనా అల్లర్లకు పాల్పడినా ప్రేరేపించినా ఉపేక్షించే ప్రసక్తి లేదు. మతపరమైన గొడవలు సృష్టించాలని చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటాం. – కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కల్యాణం, యాత్రలకు ఏర్పాట్లు పూర్తి


మాట్లాడుతున్న నిర్వాహకులు

శ్రీరామ మహాశోభాయాత్రను సంపూర్ణమైన భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. శోభాయాత్ర బల ప్రదర్శన కోసం కాదు.. కేవలం మనుషుల మధ్య ఐక్యత, శాంతి సాధన దీక్షను కోరుతూ నిర్వహిస్తున్నాం. ఉదయం ఆరు గంటలకు కల్యాణోత్సవం, అనంతరం భక్తుల నినాదాలతో శోభాయాత్ర నగరంలోని 21 కూడళ్ల మీదుగా సాగుతుంది. – జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్, నిర్వాహకులు

బాధిత రైతులను ఆదుకోవాలి


డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న రవిశంకర్‌రెడ్డి, తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకరరెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ మక్బూల్ బాషా, రైతు సంఘం నాయకులు మునిరెడ్డి, వెంకటేష్, సుబ్బయ్య, ఆప్ కి అవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు షాజహాన్ కోరారు. డీఆర్వో విశ్వేశ్వర్‌రెడ్డిని మంగళవారం వారు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రైతుల పంట పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చూడాలన్నారు. చెన్నూరు, వల్లూరు, కమలాపురం మండలాలను సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నామని, వరి, చీని, మామిడితోటలను, మినప, శనగ, కంది, పెసర పంటలను పరిశీలించిన సందర్భంగా ఆయా రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఎరువులు, పురుగు మందుల కోసం ఖర్చుపెట్టారని, వారికి కనీసం సూచనలు, సలహాలు ఇచ్చిన నాథుడే లేడన్నారు. అం తేకాకుండా పెసర, మినుము, కంది, శనగ వంటి ఆహార ధాన్యాల పంటలు కోతకు వచ్చిన దశలో బూడిద తెగులుతో మాడి మసిగా మారాయన్నారు. రెండు ఎకరాలున్నటువంటి రైతు వరిని కాపాడుకోవడానికి సుమారుగా రూ.40 వేల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేదన్నారు. చీని, మామిడి తోటల రైతులకు అపార నష్టం వాటిల్లిందన్నారు. ఇందుకు డీఆర్వో తమ వంతుగా ఆదుకునేందుకు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకరరెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు షేక్ మక్బూల్ బాషా, రైతు సంఘం నాయకులు మునిరెడ్డి, వెంకటేష్, సుబ్బయ్య, ఆప్ కి అవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న అశోక్ యాదవ్

కడప కార్పొరేషన్: ఆచార్య నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీల్లో దూర విద్య ద్వారా అందించే వివిధ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని అశోక్ స్టడీ సెంటర్ నిర్వాహకులు అశోక్ యాదవ్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ దూర విద్యను మధ్యలో ఆపేసినవారు, ఉద్యోగులు, ఏపీఓఎస్ఎస్, ఎన్ఐఓఎస్ ద్వారా కేవలం ఏడు నెలల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ద్వారా ఇంటర్, పదో తరగతి పూర్తి చేయవచ్చని తెలిపారు. అలాగే బీకాం, బీఏ, బీఎస్సీ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంబీఏ, ఎంసీఏ, జర్నలిజం కోర్సులతోపాటు టెక్నికల్ డిప్లమో కోర్సులున్నాయన్నారు. దూర ప్రాంత ఉద్యోగులు, గృహిణుల కోసం ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా ఆన్‌లైన్ డిగ్రీ, పీజీ కోర్సులున్నాయన్నారు. ఈ డిగ్రీలు పూర్తిగా రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానమని, ఎవరైనా ఈ కోర్సులు చేయవచ్చని, ఆన్‌లైన్ విధానంలో రాయవచ్చన్నారు. వివరాలకు 9963095103 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

బీజేపీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు


మాట్లాడుతున్న శాంతారెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్: భారతీయ జనతా పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని జిల్లా బీజేపీ నాయకులు శాంతారెడ్డి తెలిపారు. నగరంలోని ఐఎంఏ హాల్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వెంకట సుబ్బారెడ్డిని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శాంతారెడ్డి మట్లాడుతూ బీజేపీ కేంద్ర, రాష్ట్ర అధిష్ఠానాలు జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందన్నారు. అత్యధిక సభ్యత్వం కలిగిన బీజేపీని వెంకటసుబ్బారెడ్డి మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో కోట్లాది రూపాయల పనులు కొనసాగుతున్నాయన్నారు. రాబోయే కాలంలో వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన పనిని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో గుడిసె దేవానంద్, బాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: చింతకొమ్మదిన్నె మండలం జీజీహెచ్ తండాలో గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి ఐ.శివానాయక్ కోరారు. గిరిజన కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను మంగళవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. శివానాయక్ మాట్లాడుతూ జీఎన్ఎస్ఎస్ పరిధిలో డ్యాం నిర్మించి మునకకు గురవుతున్న 106 గిరిజన కుటుంబాలకు 0.05 సెంట్ల స్థలం కేటాయించారన్నారు. గృహ నిర్మాణానికి గండికోటకు ఇచ్చిన ప్యాకేజీ అమలుచేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకూ ఎలాంటి సాయం చేయలేదని ఆరోపించారు. తమకు మంజూరైన ప్యాకేజీని తిరిగి అందించేలా చూడాలని వారు కోరారు. కమిషన్ సభ్యులు సానుకూలంగా స్పందించి కడప జిల్లా అధికారులకు తాఖీదు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణా నాయక్, సుధాకర్ నాయక్, గోపి నాయక్, పవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ కేంద్రాలు

కమలాపురం: కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని 1వ సచివాలయం, టి.చదిపిరాళ్ల సచివాలయాల్లో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం–1 ఆధార్ మొబైల్ కేంద్రంలో పెద్దచెప్పలి డిజిటల్ అసిస్టెంట్ మునికృష్ణ, చదిపిరాళ్ల కేంద్రంలో మధు సూధన్ రావ్‌లు ఆధార్ సేవలు అందిస్తారని, వారికి ఎంఎస్‌కేలు సహాయకులుగా నియమించామన్నారు. ఈ మొబైల్ ఆధార్ కేంద్రాల్లో 0–5 సం. పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయడంతో పాటు ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు, వేలి ముద్రలు అప్‌డేట్ చేయుట తదితర సేవలు అందిస్తామని ఆమె తెలిపారు.

పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పందిళ్లపల్లె, పెద్దచెప్పలి పశు వైద్యాధికారులు మల్లికార్జునరెడ్డి, శివజ్యోతి తెలిపారు. మంగళవారం పందిళ్లపల్లె, జంగంపల్లెలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన పశువులకు వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పశు ఆరోగ్య శిబిరాల్లో భాగంగా కమలాపురంలో నిర్వహిస్తున్న శిబిరాలను పాడి పరిశ్రమ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాలలో ఉచితంగా వైద్యం అందించడంతో పాటు తేలికపాటి శస్త్ర చికిత్సలు, ఎదకు రాని, చూలు కట్టని పశువుల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు, పశువులు, దూడలు, సన్న జీవాలకు నట్టల నివారణ మందు తాపిస్తామన్నారు. గొర్రెలకు ఉచితంగా బొబ్బ వ్యాధి నివారణ టీకాలు అందిస్తామన్నారు. అనంతరం పశు పోషకులకు శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కాగా పందిళ్లపల్లెలో 20 పశువులకు సాధారణ చికిత్సలు, 5 గర్భకోశ వ్యాధి చికిత్సలు, 60 పశువులతో పాటు 198 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును అందజేశారు. అలాగే జంగంపల్లెలో 14 గర్భకోశ చికిత్సలు, 3 ఎద సూదులు, 45 లేగ దూడలకు ఏలికపాము మందులు, 142 జీవాలకు నట్టల నివారణ మందులు, 9 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, 61 సాధారణ కేసులకు వైద్యం చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

1,2 తేదీల్లో రెండవ కడప బాలోత్సవం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఫిబ్రవరి 1,2 తేదీలలో రెండవ కడప బాలోత్సవం పిల్లల పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కమిటీ నాయకులు రాయల్ కరీముల్లా తెలిపారు. మంగళవారం సాయంత్రం కడపలోని సాలే నాగయ్యవీధిలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్‌లో బాలోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను హెచ్ఎం జుబేద్ అహ్మద్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ తమ పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొనేలా చేస్తామని అన్నారు. అబ్బాస్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ స్వాతంత్య్రాన్ని అపహాస్యం చేయడం దారుణం



మాట్లాడుతున్న మహమ్మద్ అలీ ఖాన్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రామ మందిరం నిర్మాణం తర్వాతే దేశానికి స్వాతంత్య్రం వచ్చినట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ముఖ్యుడు విష్ణుమోహన్ భగవత్ మాట్లాడడం దారుణమని, అతడిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. నగరంలోని ఇందిరాభావన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 200ఏళ్ల సుదీర్ఘ పోరాటం ద్వారా దేశానికి స్వాతంత్రం సిద్ధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్, అనుబంధ విభాగాలైన 60 సంస్థలు దేశంలో ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగ వ్యవస్థలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. గోవధ పేరిట ముస్లింలను వధించడం, దళితులపై దాడులు చేయడం, మసీదులపై దాడులు శాంతిభద్రతలకు సవాలుగా మారాయని విమర్శించారు. నేర విచారణా సంస్థలైన ఈడీ, సీబీఐ, ఎన్ఐఏలను ప్రభావితం చేస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులపై అక్రమ కేసులు బనాయించి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ ధర్మాన్ని నిర్వర్తించని పక్షంలో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మయన రహమతుల్లా ఖాన్, చిన్న కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం

ప్రొద్దుటూరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జీవీ.సుబ్బయ్య అన్నారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు వెంకటేశ్వరరావు టీడీపీ కోవర్టుగా మారి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 23మంది ఎమ్మెల్యేలను టీడీపీలోకి నయనో, భయానో చేర్పించింది నిజమా కాదా అని ప్రశ్నించారు. 2017లో టీడీపీ ప్రభుత్వంలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఇంటలిజెన్స్ వింగ్‌లో ఉండి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. సర్వేలెన్స్ ఎక్విప్‌మెంట్స్ కొనడానికి మీ కుమారుడు చేతన కృష్ణ కంపెనీకి ఇచ్చిన ఆర్డర్‌పై ప్రాసిక్యూట్ చేయమని కేంద్ర మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు.

బాలల మానసిక వికాసం కోసమే బాలోత్సవం


బాలోత్సవం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్: బాలల్లో మానసిక వికాసాన్ని పెంచేందుకు బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమని జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్ రెడ్డి అన్నారు. కడప బాలోత్సవం–2 కార్యక్రమాల పోస్టర్లను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలంతా చదువులతో కుస్తీ పడుతూ.. సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి లేకుండా గడుపుతుండడం బాధాకరమన్నారు. వారి మనోవికాసానికి చదువుతోపాటు, ఆటపాటలు, చిత్రలేఖనం అవసరమన్నారు. బాలోత్సవం అధ్యక్షుడు గుర్రాలగోపాల్ మాట్లాడుతూ ఈ రాకెట్ యుగంలో మానవ సంబంధాలు, కుటుంబబంధాలు, స్నేహ భావాలు బలహీనపడ్డాయని, సహకార తత్వం, సేవాభావం సడలుతోందన్నారు. మంచి ఆటవిడుపు వేడుకగా బాలోత్సవం నిర్వహించేందుకు అనేక కార్యక్రమాలను రూపొందించామన్నారు. అన్ని పాఠశాలల విద్యార్థులు ఒక చోట కలిసి గడపడం అద్భుతమైన అనుభూతినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రాహుల్, సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, సుందరయ్య, రమణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులు, విజయ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మోడల్ స్కూల్ ఏర్పాటుచేయాలి


ఆర్‌జేడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వార్డు, సచివాలయాల పరిధిలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుచేయాలని ఎస్టీఏఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌ను మంగళవారం ఆయన కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫౌండేషన్ పాఠశాలలో ఇద్దరు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఉండాలని, బేసిక్ ప్రాథమిక పాఠశాలలో 30 లోపు విద్యార్థులకు ఇద్దరు ఎస్జీటీలు ఉండేలా చూడాలని కోరారు. మోడల్ పాఠశాలకు హెచ్ఎం పోస్టు కేటాయించాలని, 6, 7, 8వ తరగతిలో 30 మంది విద్యార్థులకంటే ఎక్కువ ఉంటే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవుల శ్రీనివాసులు, చంద్రశేఖర్, నాగరాజు, పుల్లన్న, జాన్, ఆలమూరు ప్రసాద్, శ్రీరాములు, వెంకటేశు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కామ్రేడ్ లెనిన్ వర్ధంతి



లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: సోషలిస్ట్ రష్యా నిర్మాత మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ వర్ధంతి మంగళవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కడప నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న మాట్లాడుతూ రష్యాలో లెనిన్ సాధించిన విప్లవ పోరాట స్ఫూర్తి ఆదర్శమైందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చి సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించి ప్రపంచానికి దిక్సూచిగా రష్యాను ఆయన చూపించారన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని, భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకుడు షమీవుల్లా, మనోజ్, మహేష్ పాల్గొన్నారు.

16 పుస్తకాల ఆవిష్కరణ

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8, 9వ తేదీలలో ఒకే రోజున 16 పుస్తకాలను ఆవిష్కరించనున్నామని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి తెలిపారు. తాను రచించిన పుస్తకాలతోపాటు స్థానిక రచయితల పుస్తకాలు, తదితర రచనలను సాహితీ ప్రముఖులు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.